ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 203

పేజీలు : 5 వెల రూ. 2/-

శనివారం
02 ఆగస్ట్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

**ప్రముఖ దినపత్రికకు ఇంచార్జ్‌లు కావలెను**

AM News Dailey తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా నియోజకవర్గాల వారిగా విలేకరులు కావలెను. గత పది సంవత్సరాలుగా రెండు స్టేట్లలో RNA కలిగి దిగ్విజయంగా ప్రచురింపబడుతున్న AM న్యూస్ దినపత్రికకు తెలంగాణ ఇంచార్జ్, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్, మరియు రాయలసీమ ఇంచార్జ్‌లతో పాటు జిల్లా ఇన్చార్జులు, నియోజకవర్గ ఇన్చార్జులు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను..

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి: 8978772420

## రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

- ఎవరిమెప్పుకోసం ఈ విపరీత వ్యాఖ్యలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు




## యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

- మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం
- 800 మెగవాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం




## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ
- నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ
- సెప్టెంబర్ 9న ఎన్నిక... అదేరోజు ఫలితం ప్రకటన




### కేసీఆర్, హరీష్‌రావు
## తాకట్టు రాజకీయాలు

- ఆర్థాకు మేలు చేసేలా గతంలో నిర్ణయాలు
- తప్పిదాలు సరిదిద్దేలా కాంగ్రెస్ అడుగులు
- పాదయాత్రలో బిఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు




### గొర్రెల పథకంలో
## వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

దర్యాప్తులో గుర్తించిన ఇడి అధికారులు




## సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం

- అధికారంలో ఉన్నవారిని దించడంలోనూ ముందుంటారు
- వంటకంలో ఉప్పు లాంటి వారు... వారు లేకుంటే రాజకీయాలు లేవు
- దిగజారుతున్న జర్నలిజం విలువలు... సోషల్ మీడియా పేరుతో అరాచకాలు
- నవ తెలంగాణ దశమ వార్షికోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..



## సమస్యలపై పోరాటంలో
# కమ్యూనిస్టులది అగ్రభాగం

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఆగస్ట్1:
ప్రజాసమస్యలపైపోరాటంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని, వారిది రాజీలేనిపోరాటమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను కానీ, అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన నవ తెలంగాణ దశమ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. తప్పు చేసేవాళ్లను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని.. రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిర్ణయించుకున్నానని ఈ సందర్భంగా సిఎం అన్నారు. కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారు. ఎన్ని మసాలాలు ఉన్నా.. ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఉపయోగపడ్డాయి. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే.. ఆనాడు విద్యుత్ ఉద్యమాలను లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది కమ్యూనిస్టు సోదరులని నమ్ముతున్నానని అన్నారు.. 2023లో మేము అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వీరభద్రం చేసిన పాదయాత్రలు, పోరాటాలు కారణం కావొచ్చన్నారు. ప్రజా పాలనను కొనసాగించడానికి కూడా మీ సహకారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదిలావుంటే సీనియర్ పాత్రికేయులు రాసిన విశ్లేషణలు మాకెంతో ఉపయోగపడతాయని తెలిపారు. వార్తా కథనాలను నిశితంగా గమనిస్తూ ఉంటానని అన్నారు. పరిపాలనపై పట్టు సాధించాలంటే విశ్లేషణలు చదవాలని, అన్ని అంశాలు ఒకే చోట క్రోడీకరించి విశ్లేషణలు రాయడం ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. అయితే జర్నలిజం విలువలు దిగజారుతున్నాయని, ఇప్పుడు ప్రతి ఒక్కరు జర్నలిస్టుగా కనిపిస్తున్నారని అన్నారు. ఇందులో ఎవరు ఏమిటో మీరే చెప్పాలన్నారు. జర్నలిజం డెఫినేషన్ మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జర్నలిజం వృత్తిలో ఉన్నవాళ్లు తమ బాధ్యతను మరవకూడదన్నారు. సోషల్ మీడియా పేరుతో



జర్నలిజంలోకి వస్తున్నా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను వేరే చేయాలని.. వాళ్లను వేరుగా కూర్చోబెట్టాలని పాత్రికేయులకు సీఎం విజ్ఞప్తి చేశారు. వాళ్లు, మీరు ఒక్కటి కాదన్న భావనను ప్రజలకు కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ రోజు మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఎవరు పడితే వాడు జర్నలిస్ట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారు. పెన్ను పేపర్ ఇస్తే ఏబీసీడీలు కూడా రాయలేని వారు కూడా నేను జర్నలిస్ట్‌ని అంటారన్నారు. ఏం జర్నలిస్ట్ అని అడిగితే సోషల్ మీడియా జర్నలిస్ట్ అంటున్నారు. పేరు పక్కనే జర్నలిస్ట్ అని పెట్టుకుంటారు అదేదో వాళ్ల ఇంటిపేరు అయినట్టు- అంటూ వ్యాఖ్యానించారు. వాళ్ల తాతలు, ముత్తాతల నుంచి జర్నలిజంలోనే పుట్టి పెరిగినట్టు. జర్నలిస్ట్ ఎల్లయ్య, జర్నలిస్ట్ పుల్లయ్యా అని పెట్టు-కుంటు-న్నారు. వాడు ఎప్పుడైన జర్నలిజం స్కూల్‌లో చదివిండా? లేకపోతే ఓనమాలు మొత్తం అయినా వస్తాయా అంటే రెండూ రావు. ఒకప్పుడు ఈ రాజకీయ పార్టీలు సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మిన కార్డు హోల్డర్స్ అయిన జర్నలిస్టులు ఉండేవాళ్లు. లేదా జర్నలిజం చదివిన వాళ్లకు ఈ బాధ్యతలు ఇచ్చే వాళ్లు. వాళ్ల పనితనాన్ని బట్టి వాళ్లకు బాధ్యత పెంచేవాళ్లు. కానీ ఈ రోజు అదేమీ లేదు. రోడ్లమీద ఆవారా గా తిరిగేటోడు .. ఎక్కువ తిట్లొచ్చినోడు, ఏందంటే అదే మాట్లాడేటోడే జర్నలిజం అనే ముసుగు తొడుక్కొని అందరి పట్ల అసహ్యకరమైన భాషను ఉపయోగించే పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు. ఇలా జర్నలిజం ముసుగులో కొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టినప్పుడు ముందు వరుసలో ధిక్కారంగా కూర్చుంటారు. మనమేదో లోకువ అయినట్టు-, వాళ్లేదే పెత్తనాన్ని చెలాయించడానికి వచ్చినట్లు- మన కళ్లలోకి చూస్తుంటారు. ఇంకా నన్ను చూసి నమస్కారం పెడతలేవు. నన్ను చేసి ఇంకా తల వంచుకుంటలేవు అని చూస్తుంటాడు. స్టేజీ దిగిపోయి పల్ల పల్ల చెంపలు పగులగొట్టాలని నాకు అనిపిస్తది. కానీ, పరిస్థితులు, హోదా అడ్డం వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇకపోతే ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, సీపీఎం సీనియర్ నేతలు రాఘవులు, తమ్మినేని వీరభద్రం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం



ఏఎం న్యూస్, నల్లగొండ,ఆగస్ట్1:
నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అ÷-కితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థ్యం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

# కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

ఏఎం న్యూస్, వికారాబాద్,ఆగస్ట్1:
బీఆర్ఎస్ అధినాయకత్వంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బనకచర్ల విషయంలో గత పాలకులదే ముమ్మాటికీ తప్పని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు- రాజకీయాలు చేసి ఆంధ్రా పాలకులకు మేలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందని ఆ దిశగా అడుగులు వేస్తోందని ఉద్ఘాటించారు. తాకట్టు- పెట్టిన వాటాను వెనక్కు తేవడానికి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్. ఇవా(శుక్రవారం) వికారాబాద్ జిల్లా పరిగిలో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా పరిగిలో జనహిత పాదయాత్ర ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 2014 నుంచి మొన్నటి వరకు గత బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అప్పటి ఆంధ్రా పాలకులకు కేసీఆర్, హరీష్‌రావు తలొగ్గి కాంప్రమైజ్ అయ్యారని ఫైర్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్.బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయని పసిగట్టి తమ ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బనకచర్ల విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం తప్పు చేసింది... దాన్ని సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం



అని ఆయన స్పష్టంగా తెలిపారు. మేము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించాం. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ప్రజల జీవితాల్లో ఎదుర వుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా వుంది,' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గౌడ్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీ-పీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు- రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిబంధనపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు-బడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకే స్పందనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వారికి న్యాయం చేయడమే మా లక్ష్యం, అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## గొర్రెల పథకంలో వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఆగస్ట్1:
తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం అమలులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు అవినీతిపై దృష్టి సారించారు. డబ్బు భారీగా చేతులు మారిన కారణంగా ఇడిరంగంలోకి దిగింది. గత ప్రభుత్వంలోని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా ఉన్న జి. కల్యాణ్ కుమార్, ఇతర లబ్ధిదారులు, మధ్యవర్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఆధారాలు సేకరించినట్లు- ఈడీ అధికారులు ప్రకటించారు. వివిధ ప్రభుత్వ అధికారులకు ముడుపుల రూపంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు- సూచించే పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 200కుపైగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, డెబిట్ కార్డులు, 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక కూడా గొర్రెల పంపిణీలో కుంభకోణం జరిగినట్లు- గుర్తించింది. మార్చి 2021తో ముగిసిన కాలానికి సంబంధించిన కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో పథకం అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు- వెల్లడైంది. లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా ఇన్వాయిస్ రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, నకిలీ వాహన నంబర్లతో కూడిన ఇన్వాయిస్‌కు చెల్లింపులు చేయడం వంటివి గుర్తించారు. చనిపోయి/???నికిలో లేని వ్యక్తుల పేరుతో కూడా గొర్రెల యూనిట్లను కేటాయించినట్లు- తేలింది. మొత్తం తెలంగాణవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగాయని ఈడీ అంచనా వేసింది. ఈ కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత, ఇంకా ఎంతమంది అక్రమాలకు పాల్పడ్డారనే విషయంపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

## రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఆగస్ట్1:
రాహుల్ భారత్ వ్యతిరేక భాషను ఉపయోగించి ఎన్నికల సంస్థను కించపరిచారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. దేశ ఆర్థిక స్థితిని 'డెడ్ ఎకానమీ'గా అభివర్ణించడాన్ని ప్రతిపక్ష సభ్యులే వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయన ఎవరి మెప్పు కోసం ఇలాంటి విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారో తెలియదని అన్నారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని.. దాన్ని రుజువు చేసేందుకు తమ వద్ద అణు బాంబు లాంటి ఆధారాలున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షంలోని నాయకులే రాహుల్ ఉపయోగించిన భాషను వ్యతిరేకిస్తున్నారు. దేశ ఆర్థిక స్థితిని డెడ్ ఎకానమీగా మీరెలా చెప్పగలరని ప్రశ్నిస్తున్నారు. రాహుల్ చిన్న పిల్లాడు కాదని, ప్రతిపక్షనాయకుడి హోదాకు తగ్గట్టుగా వ్యవహరించాలని రిజిజు సూచించారు. అధికారులను బెదిరించడం, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ఉద్దేశపూర్వకంగా పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడం వల్ల అంతిమంగా ఓడిపోయేది ప్రతిపక్ష ఎంపీలే అని రిజిజు వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షం సభను పనిచేయనివ్వడం లేదు. ప్రజల సమస్యలను లేవనెత్తలేని ఎంపీలకు అధిక నష్టం జరుగుతుందని అన్నారు. చర్చలు పార్లమెంటరీ నియమాల ప్రకారం జరగాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ ఇద్దరూ స్పష్టం చేశారని రిజిజు అన్నారు.ప్రతిపక్ష నేత దేశానికి హాని కలిగించే ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని మండిపడ్డారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఆగస్ట్1:
జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు- వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు

**రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టాం**
**త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు**
**2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి**
**దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది మన రాష్ట్రమే**
**గూడెం చెరువులో పెన్షన్లు అందచేసిన సిఎం చంద్రబాబు**

కడప,ఆగస్ట్1:
హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని గూడెం చెరువులో చేనేత కార్మికురాలు అలివేలమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు సీఎం పింఛను అందజేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక వరకు సీఎం ఆటోలో వెళ్లారు. అక్కడ నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టామని, త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తి చేసి చెరువులన్నీ నింపుతాం అని తెలియజేశారు. సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకుంటే కరువు అనేదే ఉండదని, రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉపాధి కోసం యువత వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదని, త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని, రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎపి రూ. 14 వేలు, కేంద్రం రూ. 6 వేలు మొత్తంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వబోతున్నాం అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పింఛను ఇచ్చే రాష్ట్రం ఏపీ అని సీఎం చంద్రబాబు అన్నారు. అర్హులైన వితంతువులకు సాయం చేస్తున్నామని చెప్పారు. పింఛన్ల విషయంలో మన తర్వాత తెలంగాణ, కేరళ ఉన్నాయన్నారు. పేదలకు సాయం చేస్తే కలిగే తృప్తి మరిదేంట్లోనూ రాదని చెప్పారు. ఈ సందర్భంగా జగన్, వైకాపా నేతల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగితే మాపై విషం చిమ్మారు. అనేక మాటలు మారుస్తూ నాపై అభాండాలు వేసి అసత్యాలు రాశారు. మహిళా ఎమ్మెల్యేపైనా దూషణలకు దిగుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురించి ఇష్టానుసారంగా నోరుపారేసుకున్న వ్యక్తిని మందలించాల్సింది పోయి ఇంకా రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తి జగన్. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలి. నాయకుడే రెచ్చగొడితే ఇక కిందిస్థాయి నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడతారు. ప్రతిచోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండాలి. మభ్యపెట్టి, మోసం చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు. సాక్షి పత్రికలో వచ్చిందని నమ్మితే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లేనని అన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. 2028 డిసెంబర్ నాటికి తొలి దశ పనులను పూర్తిచేయాలని స్పష్టంగా ఆదేశాలిచ్చా. స్టీల్‌ప్లాంట్‌తో జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మంచి కార్యక్రమాన్ని చెడగొట్టడం.. పడగొట్టడం ఈజీ.. నిలబెట్టడమే కష్టం. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు- విధ్వంసం చేశారు.. కేంద్ర పథకాలను నిలిపివేశారు. తల్లికి వందనం హామీని నిలబెట్టుకున్నాం.. ఏడుగురు పిల్లలున్నా ఇచ్చాం. అమెరికాకు గ్రాండ్ క్యానియన్‌లా మనకు గండికోట ఉంది. దాన్ని ఆకర్షణీయ ప్రాంతంగా తయారు చేస్తాం. అక్కడ రూ.85కోట్లతో పనులు ప్రారంభిస్తాం. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు- చేస్తాం. గతంలో గండికోట ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తిచేశా. హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టాం. 2024 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు సీట్లు గెలిచాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు- గెలిపించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు అన్నారు. మంత్రి సవిత, ఎమెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం

# రాష్ట్ర సమితి విస్తృతస్థాయి సమావేశం

**- రాష్ట్ర అధ్యక్షులు**
**కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన**




ఏఎం న్యూస్ / హైదరాబాద్ : శుక్రవారం డాక్టర్ రాజాబాహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రం హిమాయత్ నగర్ హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం మృతి దారుల సంఘం రాష్ట్ర సమితి విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు హాజరయి ప్రసంగిస్తూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం అన్నారు నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత సహకార సంఘాలను విభజన చేయకుండా సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడం తో సహకార వ్యవస్థ చిన్నాభిన్నమై వృత్తిదారులకు తీరని శాపంగా మారిందన్నారు వెంటనే విభజించి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు పాడి పశువులు గొర్రెలు మేకలను అడవిలో మేపుకొనుటకు హక్కుని కల్పించాలని ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు గొర్రెలకు మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని చదువుకున్న యువతి యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పాల ఉత్పత్తి అభివృద్ధి చెందడానికి మినీ పాల డైరీలకు 80% సబ్సిడీ ఇవ్వాలని 50దాటిన వృద్ధులకి 5000 రూపాయల పింఛన్ ఇవ్వాలని ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు 20 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో విద్యా ఉద్యోగాల్లో 42 % శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసి కేంద్రానికి పంపించి నెలలు గడిచిన ఆమోదించకుండా బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీసీలందరూ ఐక్యంగా పోరాడాలి అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ సహకార సంఘాల ఎన్నికల సాధనకై ఆగస్టు 11 సోమవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో మరియు పశుసంవర్ధక శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని మండలానికి ఒక వారసంత నియోజకవర్గానికి ఒక్క కమ్యూనిటీ హాల్ జిల్లాకు ఒక మానస విక్రియ కేంద్రం కేటాయించాలని అన్నారు జిల్లా అధ్యక్షులకు నియోజకవర్గ అధ్యక్షులకు మండలాధ్యక్షుడు పిలుపునిచ్చారు సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడంగి శ్రావణ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికి రెడ్డి బుచ్చన్న యాదవ్ రాష్ట్ర సలహాదారు గుడిగె శ్రీనివాస్ యాదవ్ మత్స్య కార్మిక సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షులు దిటి నరసయ్య రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, సంఘ నాయకులు పి బాలయ్య యాదవ్, చేగొండ రాజన్న యాదవ్, చిగుర్ల శ్రీనివాస్, చౌడేపల్లి పర్వతాలు యాదవ్, కంప సాల వెంకన్న, ఈరి భూమయ్య,నంగి కనుకయ్య అన్న మలేష్ యాదవ్, ఐలయ్య, రాజేష్ యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## సనత్ నగర్ నియోజకవర్గంలో

# నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి: మర్రి పురు రవారెడ్డి

**- ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుంది**
**- సమస్యలను పరిష్కరించకుంటే**
**పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం**



ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ : సనత్ నగర్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిజెపి రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల తో కలిసి శుక్రవారం లినార్త్ జోన్ జోనల్ మున్సిపల్ కమీషనర్ రవి కిరణ్ ను కలిసి నియోజకవర్గంలో నెలకొన్న ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలు కారణంగా నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో వరద నీరు ముంచెత్తడంతో బస్తీలు అధ్వాన్నంగా మారాయని వరద నీరు రోడ్లపై నిలవడంతో డ్రైనేజీ, మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రధాన అంతర్గత రోడ్లు చిద్రమే ప్రయాణికులు, పాద చారులు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా ముందుండి పోరాటం చేస్తానని తెలిపారు కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నెమలి ఆనంద్ , సి విజయ్ కుమార్ ,దయానంద్ రావు, మహేష్ కుమార్ ముదిరాజ్, టి.శ్రావణ్, యం. బాబురావు, ఏ. లోహిత్ , రఘునాథ్ గౌడ్, కిరీటా, సూర్య, మల్లేశ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతలక్ష్మి ఆధ్వర్యంలో

# కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న లంకాల దీపక్ రెడ్డి



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి అండగా ఉంటూ జూబ్లిహిల్స్ నియోజక వర్గ భారతీయ జనతా పార్టీ వివిధ కార్య క్రమాలను రూపొందిస్తూ ముందుకు సాగుతోంది ఈ కార్య క్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజక వర్గం శ్రీ నగర్ కాలని బీజేపీ పార్టీ మహిళా అధ్యక్షురాలు అనంత లక్ష్మీ అద్వర్యం లో 11 ఏళ్లు గా భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ యొక్క అమృత కాలం సేవా సుపరీ పాలన,పేదల సంక్షేమానికి చేసిన అబివృద్ధి పథకాల కరపత్రాల పంపిణీ డివిజన్ లోని ప్రజలందరికీ పంపిణీ చేసే కార్య క్రమాన్ని జూబ్లిహిల్స్ నియోజక వర్గ కన్వీనర్ సూచనల మేరకు, సిటీ సెక్రటరీ దూళ్ళ ప్రేమ్ కుమార్ సలహాతో (వారుపాల్గొన్న) శాంతి కుమార్(అసెంబ్లీ జాయింట్ కన్వీనర్) సమక్షంలో నిర్వహించారు ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకాల దీపక్ రెడ్డి హాజరు అయ్యారు ముఖ్య అతిథిగా పాల్గొన్న దీపక్ రెడ్డి కి శాలువాతో ఘనంగా సన్మానించారు అనంత లక్ష్మీ. దీపక్ రెడ్డి డివిజన్‌కి సంబంధించిన నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాళ్లతో కలిసి ఎల్లరెడ్డి గూడా, పరిసర ప్రాం తాలు, నాగార్జున నగర్ కమిటీ హాల్‌కి దగ్గరలో,భక్త సమాజం ప్రాంతాలులో ఉన్న ప్రజలకు భారతీయ జనతా పార్టీ కరపత్రా లను ఇచ్చి వాటి గురించి వివరించారు ఈ కార్యక్రమంలో కోలన్ సత్యనారాయణ (హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి) నరేందర్ యాదవ్, గూడూరి శ్రీధర్ రెడ్డి (ఎర్రగడ్డ సీనియర్ నాయకులు) ఉమేశ్,రాజేష్, శ్రీధర్,గాంధీ, చంటి యాదవ్ (పహల్వాన్), సాయి కిరణ్,అజయ్,శంకర్, శివ కుమార్, పవన్ (శ్రీకృష్ణనగర్), వినయ్ (ఎల్ఎన్‌నగర్) మహిళా నేతలు లతా యాదవ్ ,తదితరులు పాల్గొన్నారు నరేందర్ యాదవ్ ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యులు లంకాల దీపక్‌రెడ్డికి హారతులు పట్టి ఆశీర్వదించారు.

## కష్టాలలో ఉన్న వారి జీవితాలలో ఉదయించే సూర్యుడు

# అపర దాన కర్ణుడు ఉదయ్ సుందర్ కోలపల్లి

**- సుమారు కోటిన్నర రూపాయలకు పైగా నిరాశ్రయులు**
**నిస్సహాయులకు సహాయంగా అందజేసిన దానశీలి**



ఏ ఎం న్యూస్, హైదరాబాద్ 01, ఆగస్టు: ఆధ్యాత్మికవాదులు ఎవరైనా ఏ చిన్న కష్టం వచ్చినా భగవంతుడా నీ దయ మమ్మల్ని కాపాడు అని ప్రార్థిస్తారు. దేవుడు ఆ మొర వెంటాడో లేదో తెలియదు గాని భక్తులైతే ఆ భగవంతుడే లేకపోతే నేనేమైపోదునని ఒక విశ్వాసంలో జీవితాన్ని ముందుకు నడిపించుకుంటారు. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదని తెలుగులో ఓ సామెత ఉపయోగిస్తారు. భగవంతునికి కూడా పుష్పమో.. ఫలమో అర్పించుకుంటే కానీ కోరిన వరాన్ని పొందలేమంటారు. అటువంటిది వరాలు కోరుకొని వారికి కూడా ఏదైనా కష్టం ఉందని ఆయన దృష్టికి వస్తే నిలువెల్లా చెలించి పోతారు. అడగకుండానే ఆపన్న హస్తం అందిస్తారు. భగవత్ స్వరూపములో ఉన్న మహా మనిషి ఆయనే ఉదయ్ సుందర్ కోలపల్లి. ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా మచిలీపట్నంలో 1944 ఆగస్టు 2న, కోలపల్లి లక్ష్మీ బృందావనమ్మ కోటేశ్వరరావుల ప్రథమ సంతానంగా ఉదయ్ సందర్ జన్మించారు. నాన్న చిరుద్యోగి అమ్మ గృహిణి అల్లరి ముద్దుగా పెరిగిన ఉదయ్ సుందర్ చదువులో ఎప్పుడు వినపడలేదు తల్లిదండ్రుల ప్రేమను కష్టాన్ని అర్థం చేసుకున్న ఆయన ఇంజనీరింగ్ చదివి విద్యుత్ శాఖలో పనిచేశారు. న్యాయంగా నీతివంతంగా కష్టపడి పనిచేసిన ఉదయ్ సుందర్ జీవితంలో తన సాటివారికి సహాయపడటంలో ఏనాడూ వెనుకడుగు వేయలేదు. అంతే కాదు అయినా 31 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎటువంటి అవినీతికి పాల్పడకుండా నికార్సైన వ్యక్తిత్వంతో విఆర్ఎస్ తీసుకుని బయటకు వచ్చారు. వారి జీవిత భాగస్వామి కమల ఉదయ్ సుందర్ ఏనాడూ ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడ్డు చెప్పి యెరుగరు. ఇప్పుడు 80 ఏళ్ల వయసులో కూడా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలకు జీవిత బహిరస్వమే కాదు ఆయన కడుపున పుట్టిన ఇద్దరు ఆడ పిల్లలు, అమెరికాలో ఉన్నత స్థాయిలో ఉన్నా తండ్రి చేసే సేవా కార్యక్రమాలకు కావలసిన విధంగా ప్రోత్సహించేరే కానీ ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. అందుకే కలియుగ దానకర్ణునిలా సుమారు కోటిన్నర రూపాయలకు పైగా సేవా కార్యక్రమాలకు అందజేయగలిగారు. వీరి సహాయ ఛత్రం కింద నిరాశ్రయులైన వృద్ధులు, తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని వీధి బాలలు, ఒంటరి తల్లులు, దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడుతున్న వారు, ప్రమాదాలకు గురై వైకల్యం పొందినవారు, చదువుకోవాలని ఆశ వుండి పేదరికంలో మగ్గిపోతున్న విద్యార్థులు ఇలా లెక్క మొదలు పెడితే అది హనుమంతుని తోకలా పెరుగుతూనే ఉంటుంది. ఉద్యోగ విరమణ తరువాత అమెరికాలో స్థిరపడినా ప్రతి సంవత్సరం ఇండియాకు వచ్చి మరి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలోని నిస్సహాయులకు అండగా నిలుస్తారు. మరో విశేషమేమంటే వీరు ఎవరికైనా సహాయం చేస్తే వారిలో చురుకుగా ఉన్న వాళ్లను వాలంటీర్లుగా తీసుకొని ఆయన చేసే సేవా కార్యక్రమాలలో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యేలా చూస్తారు. ఉదయ్ సుందర్ కోలపల్లి సహాయం చేసి ఆర్థిక పరిస్థితి లేకపోతే కనీసం సేవా కార్యక్రమాలలో పాల్గొని మానవత్వం చూపించాలని చెబుతుంటారు. ఆగస్టు 2న మనుషులలో మహనీయులు, ఆకాశమంత ఔన్నత్యం కలిగిన ఉదయ్ సుందర్ కోలపల్లి పుట్టినరోజు, ఈ సందర్భంగా వారికి నిండు నూరేళ్లు చక్కని ఆరోగ్యము సంతోషకరమైన జీవితం ప్రసాదించాలని ఆయన ప్రగాఢంగా విశ్వసించే శ్రీ రామచంద్రులు వారికి వారి ద్వారా సహాయ సహకారాలు అందుకున్న ప్రతి ఒక్కరూ ప్రార్థిస్తున్నారు.

# రాజీవ్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం

**కొత్తగా 30 లక్షల మంది రాజీవ్ ఆరోగ్యం శ్రీ పథకంలోకి చేర్చిన రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపిన జిల్లా ఉపాధ్యక్షుడు యువజన కాంగ్రెస్ పెద్దపల్లి ..ఇరికి మహేష్**



ఏఎం న్యూస్ / హైదరాబాద్ : రాష్ట్రంలో రాజీవ్ఆరోగ్య శ్రీ పథకాన్ని ఆనాటి మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖరరెడ్డి 2007 లో ప్రారంభ చేయగా నేటి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం చికిత్స అందించే లిమిటెడ్ ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచడంతో త్రీవ అనారోగ్యలకు గురైన వారు ఆరోగ్యం శ్రీ కింద చికిత్స తీసుకునే అవకాశం దొరికింది. 2023 డిసెంబర్ నుంచి 10 లక్షల 70 వేల మంది ప్రజలు అలాగే ఇప్పటి వరకు 1590 కోట్లు బకాయిలను చెల్లించిన ప్రభుత్వం దశాబ్ద కాలం తర్వాత ఫాకేజ్ ధరలు సవరణ సగటున 22 శాతం చార్జ్ లు పెంచడం జరిగింది. ఇటీవల కాలంలో 100 దవాఖన ధరఖాస్తు చేసుకున్న సందర్భం రాష్ట్ర వ్యాప్తంగా 1402 దవాఖన, 1672 రోగాలకు. కొత్త రేషన్ కార్డుల జారీ తో పెరిగిన లబ్దిదారులు గతలో 90.10 లక్షల తెల్ల రేషన్ కార్డులు వుంటే 2.84 కోట్లు మంది ఆరోగ్యం శ్రీ పరిధిలోకి వచ్చే వారు. రాష్ట్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాల తర్వాత రేషన్ కార్డు మంజూరు చేసిన సందర్భంలో 93,993,361 కుంటుంబలాకు గాను 03 కోట్లు 14 లక్షల పైగా లబ్ధిదారుల వున్న కొత్త గా 30 లక్షల మంది ఆరోగ్యం శ్రీ పథకం లోకి వచ్చి చేరిన శుభ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ఆరోగ్య శ్రీ పథకం పరిధి పెచ్చి మాట నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి గౌరవం శ్రీ డి శ్రీధర్ బాబు గారికి, రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవం శ్రీ రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ అన్న గారికి యువజన కాంగ్రెస్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తూ.

# కలెక్టర్ హరిచందన, మంత్రి పొన్నం ప్రభాకర్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :




గత పది సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డులు మంజూరు కాకపోవడం వల్ల అనేక పేద మధ్యతరగతి కుటుంబాలు ఆహార భద్రత కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి రేషన్ కార్డులు అందించాలనే లక్ష్యంతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహేమత్ నగర్ డివిజన్‌లోని హెచ్ఎఫ్ నగర్ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ హరి చందన,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై, స్వయంగా లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు పత్రాలను అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మొన్నటి వరకు భాగ్యనగరంలో బోనాల పండుగ జరిగితే, ఇప్పుడు రేషన్ కార్డుల పంపిణి పండుగ జరుగుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారి సంకల్పంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రహ మత్ నగర్ ( జూబ్లిహిల్స్ నియోజక వర్గం)కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చింది అని అన్నారు కార్యక్రమానికి భారీ సంఖ్యలో లబ్ధిదారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు హాజరు అయ్యారు ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్, ఆర్ డి వో, వివిధ డివిజన్ ల కార్పొరేటర్ లు, వివిధ హెూదాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణనగర్, ఎల్ ఎన్ నగర్ లో

# కార్యకర్తల ఇంటింటికి వెళ్ళిన మాగంటి వజ్రనాథ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ఇంటింటికి మాగంటి వజ్రనాథ్ అనే కార్యక్రమంలో భాగంగా యూసఫ్ గూడా డివిజన్( జూబ్లిహిల్స్ నియోజక వర్గం) పరిధిలోని శ్రీ కృష్ణ నగర్, ఎల్ ఎన్ నగర్ లోనీ బి ఆర్ యస్ పార్టీ సీనియర్ నాయకురాలు అమ్మాజీ, ఆదిలక్ష్మి, కైసర్ జాన్ , నాగమణి, నూర్జహాన్ రేష్మ,రత్నకుమారి( తిరుమల అపార్ట్మెంట్):ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు దివంగత మాగంటి గోపినాథ్ అన్న, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాగంటి వజ్రనాథ్ .ఈ కార్య క్రమం లో యూసఫ్ గూడా డివిజన్ బి ఆర్ యస్ పార్టీ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ బసవరాజు, పేరుక రవి( మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు), శ్రీనివాస్ ,వినోద్ చౌదరి,హాసన్( కాంటెస్ట్ డ్ కార్పొరేటర్ అభ్యర్థి), నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, ముబీన్, యాదగిరి( తిరుమల అపార్ట్మెంట్)రమాదేవి, స్రవంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు నుండి కోటీకి బస్ సౌకర్యాన్ని ప్రారంభించిన ఆర్టీసీ డిపో మేనేజర్, సూపరింటెండెంట్



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసుల ప్రయాణ కష్టాలను బర్కత్‌పురా ఆర్టీసీ డిపో మేనేజర్ మంజుల, సూపరిండెంట్ జయలక్ష్మి అర్థం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు మరియు 4.30 గంటలకు కొల్లూరు నుంచి కోఠికి బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చారు. మూడో బస్సును శనివారం ఉదయం 5 గంటల నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కోఠి నుంచి రాత్రి 9.30 గంటల నుంచి కూడా సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు కోఠిలో 9.30 గంటలకు బయల్దేరి.. రాత్రి 11.00 గంటలకు కొల్లూరు-2కు చేరుకుంటుందని చెప్పారు. ఈ బస్సు సర్వీసులను డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మంజుల, సూపరిండెంట్ జయలక్ష్మి సూచించారు. ఎన్నో రోజుల ప్రయాణ కష్టాలను అర్థం చేసుకుని బస్సు సర్వీసులను ఇచ్చిన మంజుల, జయలక్ష్మికి కొల్లూరు-2 డబుల్ బెడ్ రూమ్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. బర్కత్‌పురా ఆర్టీసీ డిపో డ్రైవర్లు, కండర్లకు సిబ్బందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం పెద్దలు సైతం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్రం మెడలు వంచైనా బీసీలకు

# రిజర్వేషన్ సాధిస్తాం : డాక్టర్ కోట నీలిమ




ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42% రిజర్వేషన్లు సాధిస్తామని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్ నగర్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పార్టీ ప్రకటించిన మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఇచ్చిన హామీని నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. బీసీలకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో చెప్పేందుకే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ జనహిత పాదయాత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నట రాజన్, పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ జనంలోకి వెళ్లి వారి అవసరాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. దేశానికి దశ, దిశ రాహుల్‌గాంధీ అని.. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన నిస్వార్థంగా తపిస్తున్నారని కోట నీలిమ పేర్కొన్నారు. సోనియా గాంధీ మాట ఇచ్చినందుకే తెలంగాణ వచ్చిందని, ఖర్గే, రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో ఢిల్లీకి తమతో కలిసి రావాలని బీసీ నేతలకు విజ్ఞప్తి చేశారు. రెడ్డి అయి ఉండి కూడా బీసీల కోసం సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని సి ఎం ను కొనియాడారు డాక్టర్ కోట నీలిమ.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పౌర్ణిమ జన్మదిన వేడుకలు




ఏ ఎం న్యూస్, కూకట్పల్లి 01, ఆగస్ట్ : టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సహాయకురాలిగా పని చేస్తున్న పౌర్ణిమ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బండి రమేష్ హాజరై, పౌర్ణిమ చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం కృషి చేస్తున్న కార్యకర్తలకు ఎప్పటికీ గౌరవం లభిస్తుం దని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, రాజు ముదిరాజ్, మధు, G. నరేష్, అశోక్ చారి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# అజయ్‌గా యోగి ఆదిత్యనాథ్ బయోపిక్ చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరణ



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటు-డు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల ఎనిమిదేళ్లుగా ప్రజలకు అందుబాటు-లో ఉన్నప్పుడు ఎటు-వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్టును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.

# కింగ్డమ్ పార్ట్ -2 పై అప్పడే ప్రకటన




విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్టీ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.

# రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్




బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు-డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు-డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కై-కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంగీత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు- సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు- తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.

# రామయణ కోసం కిశోర్‌ను వదిలేసిన రణ్‌బీర్




రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా కోసం కిశోర్ కుమార్ బయోపిక్‌ను రణ్‌బీర్ వదులుకున్నారని బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ బసు తెలిపారు. మంచి నిర్ణయమే తీసుకున్నారని ప్రశంసించారు. దివంగత గాయకుడు, నటు-డు కిశోర్ కుమార్ బయోపిక్ గురించి కూడా అనురాగ్ బసు మాట్లాడారు.నేను రణ్‌బీర్‌తో మరో సినిమా చేయాలని ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. కానీ, మా ప్రయత్నాలు ఫలించడం లేదు. రణ్‌బీర్ తన జీవితంలో ఏ విషయంలోనైనా నిజాయతీగా నిర్ణయాలు తీసుకుంటాడు. రామాయణఆఫర్ వచ్చినప్పుడే కిశోర్ కుమార్ బయోపిక్‌లోనూ అవకాశం వచ్చింది. ఈ రెండింటిలో ఏదోఒకటి ఎంపిక చేసుకోవడం చాలా కష్టం. రెండూ గొప్ప చిత్రాలే. ఫైనల్‌గా రణ్‌బీర్ రామాయణను ఎంపిక చేసుకున్నాడు. ఈ సినిమా కోసం ఆ బయోపిక్‌ను వదులుకున్నారని తెలిపారు. అనురాగ్ బసు కాంబినేషన్‌లో రణ్‌బీర్ హీరోగా 'బర్ఫీ', 'జగ్గా జాసూస్' రెండు సినిమాలు తెరకెక్కిన విషయం తెలిసిందే. ఇక కిశోర్‌కుమార్ బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటించనున్నట్లు- వస్తోన్న వార్తలపై అనురాగ్ బసు స్పందించారు. దాని గురించి ఇప్పుడే చెప్పలేనన్నారు. అన్నీ ఓకే అయ్యాక అగ్రిమెంట్ మీద సంతకం చేసిన తర్వాతనే అధికారికంగా వెల్లడిస్తానన్నారు. ఇక రణ్‌బీర్ ప్రధాన పాత్రలో నితేశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా 'రామాయణ' రానుంది. వచ్చే ఏడాది దీపావళికి మొదటి పార్ట్ ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 2027లో రెండో భాగం విడుదల కానుంది.

# చకచకా పెద్ది మూవీ షూటింగ్



కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు-, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు-డు శివరాజ్ కుమార్‌తోపాటు-, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.

## Mana Cinemalu

# మహావతార్ నరసింహకు జనం నీరాజనం




పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడించారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.

# ఆసక్తికరంగా వచ్చివన వాడు గౌతమ్ టీజర్



యంగ్ హీరో అశ్విన్ బాబు చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ సినిమా మీద ఆసక్తి ఏర్పరిచింది. ఈ సినిమాకి మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ సినిమాని నిర్మాత టి.గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో - ప్రొడ్యూసర్. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇం-టె-న్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటీవలే భారీ బడ్జెట్ తో హైవోల్టేజ్ -ల్గ÷కె-మాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీని వాడి ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశారు. రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేదేకర్, అజయ్,గణేష్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు.